జ్యా క్రీ

ఆ జమీందారుగారికి కుక్కలంటే ఎంతో ప్రీతి. సాలుకు నాలుగులక్షల ఆదాయం వచ్చే ఎస్టేటు. నూరు నూటా ఇరవై గ్రామాల వరకూ ఉన్నవి వారి ఎస్టేటులో. చిన్నదయినప్పటికీ అనాదినుండీ ఆంధ్రదేశంలో పేరుపడ్డ సంస్థానాల్లో ఈ జమీందారుగారి సంస్థానం ఒకటి.

ఆ జమీందారుగారిది ఆర్వేల నియోగుల శాఖ. వారి తండ్రి ముత్తండ్రు లెవ్వరూ ఇట్లాంటి కుక్కల పిచ్చి యెరగరు, వాళ్ళ హయాంలో తాహతుకు తగినట్లు ఒకటో రెండో ఏనుగులూ, పది పన్నెండు గుర్రాలు, ఒక లొట్టిపిట్టా ఇట్లాంటివి జమీందారీ దర్జానిమిత్తం కొన్ని దివాణంలో పెంచుతూండేవారు. అట్లాంటిది మన జమీందారుగారికి ఎట్లా వచ్చిపడిందో ఈ కుక్కల పిచ్చి సంప్రాప్తమైంది.

అమాంబాపతు యెట్లా లేదన్నా సాలుకు నలభై వేల రూపాయల వరకూ వారికి కుక్కల పెంపకం మీద శలవు అవుతూ వుంటుంది. ప్రపంచంలో ఏయేదేశాల్లో ఎట్లాంటి కుక్కలున్నవో రకరకాల భైరవ మూర్తులను పరిశీలించి ఒక్కొక్క రకానికి, ఒక్కొక్క జాతికి, ఒక్కొక్క లక్షణానికి ఒక ఆడా మొగ జంటల్ని తెప్పించి సంస్థానంలో పెట్టి పోషిస్తున్నారు. పంచపాండవుల్లో నకులుడు ప్రత్యేకం అశ్వ శాస్త్రంలో ప్రవీణుడయినట్లు, సహదేవుడు పశుశాస్త్రంలో ప్రవీణుడయినట్లు మన జమీందారుగారు శునక శాస్త్రంలో గొప్ప ప్రావీణ్యం సంపాదించాడు. ఒక్కసారి చూచినట్టయితే, ఒకొక్క కుక్క జన్మ- దాని గుణసంపత్తి, లక్షణమూ జ్యోతిషం చెప్పినట్లు ఆమూలాగ్రంగా ఏకరువు పెట్టగల అసాధారణశక్తి వారిది.అదిగాక ఎటువంటి పొగరుయెంత గ్రామ ంహమైనా సరే, మన జమీందారుగారి సమక్షంలో పడి వారి ముఖావలోకనం చేసిందంటే, తోకముడుచుకొని పిల్లివలె తలక్రిందికి వంచి వారి పాదాల దగ్గర జోహారనవలసిందే. మరి శ్రీవారి వద్ద ఉన్న ఆమహాత్మ్యం ఏమిటో!

కుక్కల కొరకు వారు తమ సంస్థానంలో ప్రత్యేకంగా రెండు పెద్ద మహాడీలు కట్టించారు. ఒక్కొక్క మహాడీకి క్రింది వరుసలో పాతిక గదులూ, పై వరసలో పాతిక గదులును. ఒక్కొక్క గదికి ఒక్కొక్క జాతి కుక్కల జంట చొప్పున నూరు గదులుకూ నూరు శునక దంపతులు ఎప్పుడును వారి సంస్థానంలో పెరుగుతూ వుంటవి. న్యూఫౌండులాండు కుక్కలు, ఇంగ్లండు కుక్కలు, ఫ్రాన్సు కుక్కలు, అమెరికా కుక్కలు, జర్మనీ కుక్కలు- ఒకరక మేమిటి, ఒక దేశమేమిటి. నానాజాతి కుక్కల సమితికి జమీదారుగారి సంస్థానం ఆటపట్టు. పెద్దపులులనూ, సింహాలనూ, ఏనుగులనూ వేటాడి అమాంతంగా కొరికి ముక్కలు చేయగల సాహసం గలిగిన వేటకుక్కలు కొన్నీ, ముఖంమీద కళ్ళయినా కనుపడకుండా నఖశిఖ పర్యంతమూ మూరెడు బొచ్చుతో ఉండే పొట్టి కుక్కలు కొన్నీ, వంటిమీద ఒక్క రోమమైనా ఉన్నదో లేదో అన్నట్టుగా రెబ్బరువలె నున్నటి దేహంగల కుక్కలు కొన్నీ, బొచ్చు కుచ్చుతోకలుగల కుక్కలు కొన్నీ, డోలువాయిద్యగాని కుడిచేతిలో ఉండే పుల్లవలె చివర వంగిన సన్నని తోకలుగల కుక్కలు కొన్నీ, నల్లవి కొన్నీ, ఎర్రవి కొన్నీ, తెల్లవి కొన్నీ, బట్లవి కొన్నీ, చింతపువ్వు వన్నెవి కొన్నీ, గోధుమ వన్నెవి కొన్నీ పిల్లికళ్ళ కుక్కలు కొన్నీ, కాటుకకళ్ళ కుక్కలు కొన్నీ- ఒకరకం ఏమిటి, అనేకరకరకాల కుక్కలు ఆ సంస్థానంలో వున్నాయి. మన రాజాగారికి దేశ కుక్కలంటే మాత్రం సుతరామూ సరిపడదు. జాతికుక్కల మీదనే వారి కెంత సేపూ మోజు. అందుచేత శ్రీవారి సంస్థానంలో ఒక్క దేశ కుక్క కయినా ఆస్కారం లేకుండా పోయింది.

కుక్కల మహాలులో ఒక్కొక్కగదిలో ఒక్కొక్క శునకముల జంట. వాటికి విశాలమైన పెద్ద పడక మంచం, స్నానపు తొట్టి, పాయిఖానా, ఒక మేజాబల్ల, బల్లమీద ఒక నిల్వుటద్దం, భోజన పాత్రలూను. ఆ కుక్కలకు సంరక్షణ చేయడానికి - అనగా రోజూ వేడినీళ్ళతోనూ, సబ్బుతోనూ స్నానాలు చేయించి, చలవ చేసిన తువాళ్లతో తుడిచి వాటిని శుభ్రపరచడానికి చాకిరీ చేయడానికి డెబ్బయి ఎనభై మంది

నౌకర్లూ, చాకర్లూనూ, విదేశాల్లో పుట్టి సమస్తమైన భోగభాగ్యములూ అనుభవించే కుక్కలు తమ మూలాన్న ఇంత దూర దేశానికి సముద్రాలు దాటి, వచ్చినందుకు, సుకుమారమైన ఆ శునక రాజములకు కటువైన హిందూ దేశపు శీతోష్ణస్థితులు సరిపడునో సంపడవో అని రాజాగారు ఆకుక్కల విషయమై కంట్లో వత్తి వేసుకొని అన్ని ఏర్పాట్లూ పరిశీలించి కాపాడుతూ ఉంటారు. వాటికి చలికాలంలో ఫ్లానల్ చొక్కాలూ, ఎండా కాలంలో గ్లాస్కో మల్లు చొక్కాలు కుట్టించి సప్లయి చేయించారు. సాయం కాలం షికారుకు పోవలసినప్పుడు వేయవలసిన డ్రెస్సువేరూ, రాత్రి పండుకొనేటప్పుడు ఉదయం బ్రేక్‌ఫాస్టు అప్పుడు వేయవలసిన డ్రెస్సువేరూ!

ప్రతిరోజూ వుదయం ఒక గంటసేపూ, సాయంత్రం ఒక గంట సేపూ నౌకర్లు కుక్కల జంటల్ని మెడకు కట్టిన వెండి బంగారుపూత గొలుసుల్ని చేత పట్టుకొని బయటికి తీసి, మహడీలకు చుట్టూ ఉన్న ఆవరణలోని ఉద్యానవనంలో విహారముగా త్రిప్పుతూ ఉంటారు. ఆ సమయాల్లో జమీందారుగారూ, వారి సతీమతల్లి కూడా ఒకసారి కుక్కల మహడీలకు వేంచేపు చేసి, వాటి అభివృద్ధిని స్వయంగా పరీక్షిస్తూ నౌకర్లు కుక్కల సేవలో అప్రమత్తులై ఉన్నారా లేదా అని పై తణిఖి చేసిపోతూ ఉంటారు. ఆ జమీందారు గారు కుక్కలను చూచుకొని పొందే ఆనందానికి మేర ఉండదు.

జమీందారుగారికి ఇన్ని కుక్కలున్నప్పటికి ఇవిగాక వారితో కూడా ఎప్పుడూ విడవకుండ ఉండే మరొక స్పెషల్ జాతి కుక్కలజాతి ఒకటి ఉన్నది. ఈ జత వారు ఇంగ్లండులో ఏరితెచ్చుకొన్న జత. ఈ జతను శ్రీవారు సర్వకాల సర్వావస్థలయందును విడిచి పెట్టకుండా, వారివద్దనే పెట్టుకొని పెంచుతూ ఉంటారు. శ్రీవారు భోజనం చేయునప్పుడు ఈ రెండు కుక్కలూ వారికి చెరొక తట్టూ కూర్చొని భుజింపనిది శ్రీవారికి అన్నం నోటికి హితవుగా పోదు. వారు బల్లవద్ద కూర్చొని ఆఫీసుపని చేసుకొనేటప్పుడు ఈ కుక్కలు రెండూ వారికి ఇరు పార్శ్వములా కుషన్ కుర్చీలో కూర్చుని ఉంటవి. శ్రీవారు మోటారులో బయటికి వాహ్యాళి

వెళ్ళినప్పుడు కూడా ఈ రెండు కుక్కలూ వారితో మోటారెక్కిపోతూ ఉండవలసిందే. రాజాగారు రాత్రిళ్లు పండుకొనే గదిలోనే ఈ శునక దంపతులకు కూడా పడక.

ఈ రెండు సీమకుక్కలలోనూ మొగకుక్క పేరు జాకీ; ఆడకుక్క పేరు జానీ. ఇవికూడా జమీందారుగారివద్ద మితంగా మాలిమయి వారిని ఎడబాసి ఒక్క నిముషం కూడా ఉండేవి కావు. అదిగాక అవి మాటలు నేర్చిన కుక్కలు. రా అంటే రావలసింది, పో అంటే పోవలసింది, కూర్చో అంటే కూర్చోవలసిందీని. జమీందారుగారికి ఆఖరుకు ఈ కుక్కలే వారసత్వం వహిస్తాయని కొందరూ, తమకు పుత్ర సంతానం కలిగినప్పటికీ, వారికి చెందకుండా ఉండేటట్లు తమ అనంతరం జాకీ సింహాసనానికి రావలసినట్లుగా ప్రతి సంవత్సరం జనవరి నెల ఒకటో తేదీన ఎస్టేటు అంతా జాకీకి వీలునామా వ్రాసి రిజిస్టరు చేయించి ఉంచుతున్నారని కొందరూ, వారసత్వం సంగతి నిజమైనా కాకపోయినా ఈ రెండుకుక్కల పోషణ నిమిత్తమై శ్రీ వారు ఒక లక్షరూపాయలు జాకీ పేర బాంకిలో వేసి, వాటిపేర సెటిల్మెంటు వ్రాసియిచ్చారని కొందరూ - ఈ విధంగా అనేకరకాల పుకార్లు ఎస్టేటులో రోజుకు లక్ష బయల్దేరుతూ ఉంటాయి.

ఇటీవల ఒకనాడు జమీందారుగారు జాకీని, జానీని మోటారులో కూర్చోబెట్టుకుని, టౌన్‌హాలులో గానసభకు బయల్దేరి వెళ్ళి, బయటగేటు వద్ద కారు నిలిపి, ఎవరో పెద్దమనిషితో మాట్లాడుతు వుండగా, ఒక యానాది పిల్లవాడు, పదేళ్ళవాడు, నల్లగా వంటిమీద గోచీతప్ప మరో గుడ్డ లేకుండా అసహ్యం వేస్తూ తళతళలాడే మోటారు చూపించి, వింతగా చూస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఎప్పుడు చూచిందో, జాకీ వాణ్ణి చూచి "నీ బ్రతుక్కి నువ్వు కూడా జమీందారుగారి మోటారును సమీపించి మమ్మల్ని అపవిత్రం చేస్తావా" అన్నట్టు ఆగ్రహించి, పరధ్యానంగా వున్న యానాది పిల్లవాడి మీదికి గభాలున పెద్దపులి దూకినట్లు దూకి తొడలో ఒక కాటు వేసేవరకు, వాడు కెవ్వుమని కేక వేసి వెనక్కి విరుచుకొని

పడ్డాడు. పరధ్యానంలో వున్న జమీందారు గారు ఇది గమనించి, "ఆ! ఆ! జాకీ, ఇట్లారా" అని పిలువగా, అది తిరిగి మోటారులో ఎక్కి, తోక ఆడిస్తూ జమీందారుగారి చేతిని నాలుకతో చప్పరించింది. ఇంతలో గానసభకు వేళ అయినందున మోటారు కదిలించి శ్రీవారు లోపలకు వెళ్ళిపోయారు. హఠాత్తుగా కలిగిన విపత్తుకు గుండె చెదరి, శరీరం ముచ్చెమటలు పోసి, రోడ్డు మీదనే వెల్లికిలా పడిపోయి వున్నాడు. మెత్తని లేత శరీరం అయి నందువల్ల వాడిగల కుక్క కోరలు వాని తొడలో కనుక్కన వెన్నపూసలో కత్తి దిగినట్లు అంగుళం లోతు దిగి గాయం అయి నెత్తురు ప్రవహిస్తున్నది ఇంతలో వాళ్ళ వాళ్ళెవరో వచ్చి, పిల్లవాణ్ణి లేవనెత్తి ఇంటికి తీసుకొని పోయారు. కాని కుక్క కరిచిన పదిహేను రోజులకు వానికి సరి అయిన చికిత్స లేక, రక్తంలోకి విషం ఎక్కి కుక్క అరుపు అరచి ఆ పిల్లవాడు ప్రాణాలు వదిలివేశాడు.

ఆ దినం యానాది పిల్లవాణ్ణి కరిచినది లగాయితు యెందువల్లనో జాకీలో ఒక విధమైన కొత్త మార్పు కలుగుతూ వచ్చింది. కాలక్రమేణా పది పదిహేను రోజులు జరిగేవరకు జాకీ పూర్వంవలె గాక పిచ్చిపిచ్చిగా అరవడం, ఇతర మనుష్యుల మీదికే గాక అప్పుడప్పుడు జమీందారుగారి మీదికి దూకబోవడం, అనవసరంగా కోరలు బయటపెట్టి జానీని కూడా కరవబోవడం- ఏమిటో వెర్రి వెర్రి చేష్టలు ఆరంభించింది. యానాదివాణ్ణి కరవడానికి పూర్వమే దానికి పిచ్చి యెక్కిందో, లేక యానాదివాణ్ణి కరిచే సరికి వాని శరీరంలోని అపవిత్రమైన రక్తం ఉత్తమజాతి జాకీ రక్తనాళాల్లో ప్రవేశించి అప్పటినుండి దాని తత్త్వం చెడి ఏ జబ్బు అయినా ఆరంభం అయిందో - ఏ కారణం వల్లనో గాని జాకీకి ఆ రోజుకారోజు వెర్రివాలకం పడుతూ వచ్చింది.

యానాదివాణ్ణి కాటు వేసినప్పుడు జమీందారుగారూ కళ్లారా చూచినప్పటికీ, తర్వాత యానాది వాడేమయినాడో అన్న విచారణ చేయకపోవడం సహజమే అయినప్పటికీ, అది లగాయతు తమ జాకీలో ఎటువంటి మార్పు కలుగుతోందో అన్న ఆలోచనే వారికి తట్టకుండా

వుండడమే ఆశ్చర్యకరమైన విషయం. ఆశ్చర్యానికి మాత్రం ఏముందీ? 'బుద్ధి: కర్మానుసారిణీ' అన్నట్లు, దాని వేళ వచ్చేవరకు అన్నీ అట్లా ఒనగూడి వస్తాయి. ఎట్లా గయితేనేం, పదిహేను రోజులయిన తర్వాత జాకీ వైఖరి చూచేవరకు జమీందారుగారికి అనుమానమూ, భయమూ వేసి, అట్టే ఆలోచించుకోగా, అనాడు యానాదివాణ్ణి కరచిన విషయం తటాలున జ్ఞప్తికి వచ్చి, తక్షణం నౌకరును పంపి విచారించగా-

అప్పటికి నాలుగురోజుల క్రిందటనే యానాది వాడు పిచ్చెత్తి చచ్చి పోయాడని తెలిసింది. దానితో జమీందారుగారికి గుండెలు జల్లుమని, వెంటనే డాక్టరును పిలిపించేవరకు, ఆయన పరీక్ష చేసి, ఏవో ఒకటి రెండు ఇంజక్షనులు ఇచ్చాడు. కాని లాభం లేకపోయింది. పోనీ ఏ చెన్నపట్నానికో, కలకత్తాకో తీసుకొని వెళ్ళి ఇంకా గట్టి వైద్యం చేయించాలని శ్రీవారు ఆలోచన చేస్తుండగా ఆరోజు తెల్లవారేవరకే జాకీకి పిచ్చి అరుపులు జాస్తి అయి, ఉదయం ఏడుగంటలయ్యేసరికి ప్రాణాలు విడిచింది.

3

జమీందారుగారికిమిన్ను విరిగి మీద పడినట్లయింది. ఇంత వైపరీత్యం జరుగుతుందని వారు కలలో కూడా అనుకోలేదు. వారికి తీరని దుఃఖం సంప్రాప్తమయింది. జాకీ మరణానికివారుకుప్ప కూలిదుఃఖసాగరంలోమునిగి పోయారు. శ్రీవారి జనానా అంతా దుఃఖించారు. బంధువులందరూ దుఃఖించారు. ఇక వారి డబ్బు తినే తాబేదార్లూ నౌకర్లు చెప్పనే అవసరంలేదు. జమీందారుగారికి ఏకైక పుత్రునివంటి జాకీ చనిపోయిన దన్న వార్త ఒక్క గంటలో పట్నం అంత వ్యాపించిపోయింది. పట్నం యావన్మంది కడసారి చూపు చూడడానికి జనం గుంపులు గుంపులుగా దివాణం వాకిట మూగి కంట నీరు పెట్టుకొంటున్నారు. దివాణం వద్ద కలిగిన ఈ రోదనశబ్దం విని మహాడీలలో ఉండిన కుక్కలూ జాకీ మరణానికి దుఃఖించి, ఒక్కసారిగా

గొంతెత్తి మొర్రో అని మొరగడం ఆరంభించినవి. ఆ దినం దివాణం కచ్చేరీలకూ, ఉద్యోగులకూ శలవు ప్రకటించారు. ఎస్టేటు దివాన్‌జీగారు స్వయంగా వచ్చి, పడక కుర్చీలో మొఖం మీద చేతిరుమాలు కప్పుకొని పండుకొన్న జమీందారుగారిని పరామర్శిస్తూ శ్రీ వారి దుఃఖాన్ని ఇనుమడింప చేశారు. సృష్టి అంతా ఆ దినం మహా దుఃఖసాగరంలో మునిగి పోయినట్టుగా ఉన్నది. రాజాగారికి, జాకీ కళేబరం పెద్దపులివలె దివాణం వాకిట పడి ఉన్నది. దాని జన్మలో అది ఎన్నడూ వట్టి నేలను, పరుపు అయినా లేకుండా పండుకొని ఎరగదు. దాని శరీరం ఎంత నొచ్చుకొంటున్నదో అని జమీందారుగారికి కడుపు తరుక్కొని పోతున్నది. ఎంతమంది ఆప్తులు వచ్చి ఎంత ఊరడించి ఏం ప్రయోజనం! వంశాంకురం వంటి జాకీని మళ్ళీ బ్రతికించగలవారేరీ?

ఎంత దుఃఖించి ఏం క్రియ? 'జాతస్య మరణం ధ్రువం' అని ప్రతి ప్రాణికి మరణం తప్పదు గదా అని వారూ వీరూ ఓదార్చగా, ఇక జరగ వలసిన తంతు చాలా ఉండినందున శ్రీ వారు ధైర్యం తెచ్చుకొని జరగ వలసిన కర్మకాండా యాథావిధిగా జరిపించాలని, దివాణపు పెద్ద పురోహితుని తోనూ, తదితర ఆస్థాన పండితులతోనూ ఆలోచించి జాకీకి తగిన అంత్య క్రియాకాండ నిర్ణయించి దానిని బాండుమేళం ఊరేగింపుతో తీసుకొనిపోయి దహన సంస్కారం చేయించారు.

4

జాకీ గతించిన తర్వాత ఒక సంవత్సరంగా దాని జ్ఞాపకార్థమై ఏదైనా ఒక శాశ్వతమైన స్మారక చిహ్నం ఏర్పాటు చేయవలెనని జమీందారుగారికి మనస్సులో ఒక గాఢమైన కోరిక పుట్టింది. నాలుగువీథులూ కలిసే చోట జాకీ శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠ చేస్తామా, లేక లోహ విగ్రహం ప్రతిష్ఠ చేస్తామా, లేక జయ స్తంభం లాంటి దొక, రాతి స్తంభం కట్టిస్తామా అని పరిపరి విధాల ఆలోచన పోయింది. కాని వారు ఏది నిర్ధారణ చేసు కోలేక పోయారు.

ఇటీవల, జాకీ లైఫ్ సైజ్ ఫోటోను ఆయిల్ పెయింటింగు ఒకటి తయారు చేయించి తెప్పించి వుంచారు. జాకీ సాంవత్సరీకం నాటికి సరిగా ఒక ఏడాది పూర్తి అవుతుంది కాబట్టి, ఆనాడు జాకీ ప్రథమ వర్ధంతి జరిపి, ఈ ఫోటోను ఆంధ్ర దేశంలో గల మరో జమీందారుగారిచేత తమ సభామండపంలో బహిరంగం చేయించాలని శ్రీవారొక ఏర్పాటు ఇదివరకే చేసుకొని ఉన్నారు. కాని వారికంతటితో తృప్తి కలుగలేదు. జాకీ ఆచంద్రార్కం స్థాయిగా ప్రజలకు జ్ఞాపకం ఉండేటట్టు శాశ్వతమైన చిహ్నం ఒకటి నిర్మించాలని వారికి పెద్ద కోరిక గలిగి, ఆ విషయమై ఆలోచన తెగక, దివాన్‌జీ గారితో సంప్రదించి వారి సలహా తీసుకోవడం మంచిదని రాజాగారు దివాన్‌జీ గారిని పిలిపించారు.

దివాన్‌జీగారు యోధానయోధుడు. ఆయన కూడా ఆర్వేల శాఖీయుడే. సర్కారులో ముప్పయి ఏండ్లు తహశీల్‌దారు గిరీ వగైరా నౌకరీలు చేసి, లక్ష రూపాయలు సంపాదించి, ఏభయి అయిదో ఏట నెలకు నూట ఏభయి రూపాయల పెన్షను మీద రిటైరైయిన చెయ్యి. వయస్సు ఏభయి అయిదు దాటినా, తనకింకా శరీరదారుఢ్యం కలదనీ, అరవయ్యో సంవత్సరం వరకూ పని చెయ్యగలననీ, అందువల్ల తనను ఆ అయిదేళ్లూ కూడా సర్వీసులో ఉంచవలసినదనీ ఆయనగారు జిల్లా కలెక్టరుకూ, గవర్నమెంటుకూ అర్జీలు పంపుకొని ప్రార్థించారు. కాని, ఆ సమయానికి ఐరోపా సంగ్రామంలో యుద్ధం చేసి, దెబ్బలు తిని వచ్చిన ఒక యూరోపియను హవల్దారు ఆ జిల్లాకు కలెక్టరుగా వచ్చినందువల్ల అతగాడికి ముసలి తాబేదార్ల మీద రోత కలిగి, తహశీల్‌దారు వారి కోరికను నిరాకరించి. ఏభయి అయిదో ఏడు దాటంగనే సర్వీసులో నుండి రిటైరు చేయించాడు. రిటైరైన తర్వాత ఉద్యోగం లేకుండా ఇంటిదగ్గర గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోలేక ఆయనగారూ వారినీ వీరినీ ఆశ్రయించి రాజాగారికి సిఫార్సులు చేయించుకోగా, సాటి నియ్యోగి కదా అని శ్రీవారు అభిమానించి నెలకు నాలుగువందల రూపాయలమీద వారిని తన ఎస్టేటు దివానుగా ఏర్పాటు చేసుకున్నారు.

ఈ దివాన్‌జీగారు పీఠం అలంకరించినది లగాయతు ఎస్టేటు అంతా చక్రం తిప్పినట్లు తిప్పేస్తున్నాడు. రాజాగారిని నిమిషంలో జేబులో వేసుకొన్నాడు. శ్రీవారి తత్వం బాగా గ్రహించుకొని వారికి తూచినట్లు సరిగ్గా సరిపోయ్యే తాళపుహంగును వెనుక వేస్తూ, శ్రీవారి ఆదరాభిమానాలకు పాత్రుడైనాడు.

జాకీ స్మారకచిహ్నం శాశ్వతంగా ఉండాలంటే ఏరూపంగా చేస్తే బాగుంటుందని జమీందారుగారు దివాన్‌జీగారిని సలహా అడిగారు. దివాన్‌జీగారు అప్పట్టే ఆలోచించి నాలుగు బజార్లు కలిసే చోట నూట ఏభై అడుగుల ఎత్తున ఒక రాతి స్తంభమూ, దానికెదురుగ్గా ఒక రాతిమండపంలో పంచలోహములతో తయారుచేసిన జాకీ విగ్రహమూ ప్రతిష్ఠింపజేస్తే బాగుంటుందని సలహా యిచ్చారు.

శ్రీవారికి ఆనందబాష్పాలు కన్నులవెంట బొట బొట రాలినవి.

“ఈ రెండిటికీ ఏమాత్రం ఖర్చు అవుతుందో అంచనా వేయండి” అని మళ్లీ అడిగారు జమీందారుగారు.

అయిదునిముషాలు దివాన్‌జీగారు పైకి చూపు నిగిడ్చి, ఏమిటో తనలో తాను గొణిగి చేతివేళ్లు లెఖ్ఖ పెట్టుకొంటూ—

“బంగారు, వెండి, కంచు వగైరా లోహములు కలిసిన ప్రతిమ చాలా ఖరీదు అవుతుంది. అదీగాక ఇట్లాంటి వాటిని తయారు చేయగల పనివాళ్లు మనదేశంలో లేరు. ఈ ప్రతిమను ఏ జర్మనీలోనో, అమెరికాలోనో తయారు చేయించవలసి ఉంటుంది. కాబట్టి లోహవిగ్రహానికీ, రాతి స్తంభానికి, మంటపానికీ అన్నిటికి చేరి రమారమి ఏభయివేలయినా కాగలదని నా ఉద్దేశ్యం.” అని ఎస్టిమేటు వేశారు.

రాజుగారు రవంత ఆలోచించి “సరే! అయితే అయింది. ఎస్టేటు ఖజానాలో నుండి ఏభయివేలూ తక్షణం శాంక్షన్ చేయండి” అని హుకుం చేశారు.

కాని దివాన్‌జీగారు దూరాలోచన గల ఘటం కాబట్టి, “ఈ ఏభయి వేలూ అచ్చం ఎస్టేటు భరించడం కంటే, దీనిలో ఏ పాతిక భాగమో ఎస్టేటు తరపున చందావేయించి, మిగిలిన నలభై వేల రూపాయలూ ఎస్టేటు

గ్రామాలలో రైతుల వద్దా, వర్తకులవద్దా చందాలు వేయించి వసూలు చేస్తే బాగుంటుందని నా మనవి" అని ఒక సవరణ తీసుకొని వచ్చాడు.

జమీందారుగారికి బ్రహ్మానందంవల్ల శరీరం తన్మయత్వంలో పడిపోయింది.

"మీ ఆలోచన చాలా బాగున్నది. ఇందుకు నేనెంతో కృతజ్ఞుణ్ణి. కాని ఇంత ద్రవ్యం వసూలు చేయడానికి ఆలస్యం అవడమే గాకుండా ఈ పనిలో చాలా సిబ్బంది బలంకూడా కావలసి ఉంటుందేమో!"

"ఆ సందేహాలు తమ కవసరంలేదు. మీరు గుండెమీద చేయివేసుకొని నిద్రపొండి. అది అంతా చక్కబెట్టుకొనే భారం నాది."

"సంతోషం, ఇతర పనులన్నీ కట్టిపెట్టి మీరు ముందీ కార్యం తలపెట్టండి"

"నేను స్వయంగానే ఎస్టేటు గ్రామాలన్నీ సంచారం చేసి వస్తాను. ఇట్లాంటి పెద్ద వ్యవహారాల్లో క్రింది తాబేదార్లకు స్వాతంత్ర్యం ఇచ్చి మనం ఉపేక్ష వహిస్తే సంస్థానానికి చెడ్డపేరు రాగలదు."

"ఓహో! మీకు జాకీయెడల ఇంతటి అపారమైన అదరాభిమానాలున్నవని నా కింతవరకూ తెలియనే తెలిసుదండి. మీ ఆఫీసు పనుల్ని అసిస్టెంటు దివాన్‌పరంగా వప్పజెప్పి వెంటనే బయల్దేరండి."

"అట్లనే. కాని మీరు మాత్రం ఒక పని చేయవలసి ఉన్నది. దివాన్‌జీ గ్రామాలలో పర్యటనం నిమిత్తం వస్తున్నాడనీ, వారు కోరిన ప్రకారం దివాణం వారికి ప్రజలు కొంత ద్రవ్యసహాయం చేయవలసినదని కోరుతూ మీరు ప్రజల కాక విజ్ఞప్తి వ్రాసి నా చేతి కివ్వండి. దాన్ని నేను అచ్చు వేయించి ప్రజలలో పంచిపెట్టి, మీ తరుపున తగిన కథ అంతా నడుపుతా."

"ఓ అవశ్యం అట్లనే వ్రాసి యిస్తాను. అయినా ఆ విజ్ఞప్తి మతలబు కూడా మీరే వ్రాసి నాకు పంపండి. సంతకం చేసియిస్తాను."

"చిత్తం" అంటూ దివాన్‌జీగారు లేచి రాజాగారి శలవు తీసుకొని ఇంటికి చక్కా వెళ్లారు.

5

దివాన్‌జీగారు ఎస్టేటు హెడ్‌క్వార్టర్సు విడిచిన తరువాత అక్కడకు పదిమైళ్ళ దూరంలో ఉన్న నేలటూరు గ్రామంలో మొట్టమొదట మకాం వేశారు. వారి మకాంరోజుకు ముందురోజునే ఉత్తరఖండం దివాన్ పేష్కారుగారూ, తాణాదారు వగైరా సిబ్బంది యావన్మందీ హాజరై తయారుగా వున్నారు. ప్రజల కష్ట సుఖములన్నీ విచారించడానికీ, వారి కష్టములను తొలగించడానికి రాజాగారు కనికరించి దివాన్‌జీగారిని స్వయంగా పర్యటన నిమిత్తం గ్రామాలకు పంపుతున్నారనీ, రైతులు స్వేచ్ఛగానూ, నిర్భయంగానూ దివాన్‌జీగారి యెదుట వారివారికి గల కష్టసుఖములను చెప్పుకోవచ్చుననీ ముందుగా అన్ని గ్రామాలలోనూ దండోరా మూలముగా ప్రకటించినందున ఆ దినం ఉదయం ఏడు గంటలయ్యేసరికే చుట్టుపక్కల గ్రామాధికార్లూ, రైతులూ, మాలవాళ్లూ, మాదిగ వాళ్లూ యావన్మందీ నేలటూరు చేరి దివాన్ జీ గారి ఆగమనానికై యెదురుతెన్ను చూస్తున్నారు. తమ ఇబ్బందులు తెలుపుకో దలిచిన రైతులు కొందరు తెల్లకాగితాల మీద అర్జీలు వ్రాయించుకొని వాటిని నడుంగా మడిచి, చేతుల్లో పెట్టుకొని వస్తున్నారు.

దివాన్‌జీగారు ఉదయం ఏడున్నర గంటలకు రాగానే పేష్కారుగారు వారిని ఊరగమిడిలోనే పుష్ప మాలాలంకృతులుగా జేసి, భోగం మేళంతోనూ, సన్నాయి మేళంతోనూ ఉత్సవంతో గ్రామంలోనికి తీసుకొనిపోయి ఆనాడు సభకుగాను వేసిన పందిటిలో వేంచేపు చేయించారు. వెంటనే సభ సమావేశమై, వేదికపై వేసిన కుర్చీలలో దివాన్‌జీగారూ, వారి ప్రక్కన పేష్కారుగారూ, తాణాదారుగారూ వరుసగా కూర్చున్నారు. రైతులు రెండు మూడు వందల మంది తలకు మల్లు పాగాలు కిరీటాలవలె చుట్టి, చేతిలో కఱ్ఱలు పట్టుకొని, ముతక గుడ్డలు మోకాలిపైకి యెగగట్టి, చేత తలా ఒక అర్జీ పట్టుకొని, 'దణ్ణాలు, దణ్ణాలు' అని దివాన్‌జీగారికి నమస్కరిస్తూ పందిటిలో వేసిన ఈతాకు చాపలమీద చతికిలబడ్డారు.

పిమ్మట దివాన్ పేష్కారుగారు లేచి. దివాన్‌జీగారు ఎస్టేటు అంతా పర్యటనంచేసి, ఎస్టేటుపరిపాలన యావత్తూ రామరాజ్యంగా చేయడానికి విజయం చేసినారనీ, ప్రజలు వారియెదుట నిర్భయంగా వారి వారి యిబ్బందులను మనవి చేసుకోవచ్చునని చెప్పి దివాన్‌జీగారి ఆగమనంలో గల ప్రధానమైన ఉద్దేశాన్ని బయటకు వెల్లడిచేశారు. చంద్రుణ్ణి చూచిన చకోరపక్షులవలె రైతుల ముఖాలు వికసించినవి. ఎస్టేటు పరిపాలనలో నూతన శకం ఆరంభం అయినదని వారికి కొండంత ఆశ కలిగింది. ఈ తరుణం పోగొట్టుకోకుండా వాండ్లు ఇక్కట్లన్నీ దివాన్‌జీగారితో మొరపెట్టుకోవాలని తీర్మానం చేసుకొని తయారుగా ఉన్నారు.

పిమ్మట దివాన్‌జీ గారు లేచి, శ్రీ శ్రీ శ్రీ రాజా బహద్దురువారు గొప్ప ఉదార హృదయులనీ, తన రాష్ట్రంలోని ప్రజలను వారు తమ కడుపున కన్నబిడ్డలవలెనే ప్రేమించే ప్రేమస్వరూపులనీ, సంస్థానం రాబడిలో ఏ అర్ధ పరక భాగమో వారు స్వంత వినియోగానికై ఖర్చుపెట్టి, మిగిలిన ద్రవ్యం యావత్తూ ప్రజాక్షేమం కొరకే వినియోగింప కంకణం కట్టుకొన్న త్యాగమూర్తులని ఒక పావుగంటసేపు జమీందారుగారి గుణగణములను సభలో వర్ణించి, పిమ్మట రైతులు తమ కష్ట సుఖములు తెలుపుకోవచ్చునని ఉత్తర్వు చేశారు. రైతులు చెప్పుకొనే విషయాలు ఒక్కొక్క గ్రామానికే సంబంధించినవి ఒకటీ, రెండూ, మూడూ అని 'అయిటం' వారీగా వ్రాసుకొనుటకై పేష్కారు గారు తెల్లకాగితాల బైండు పుస్తకం తీసుకొని, కళ్ళకు సులోచనాలు తగిలించుకొని, చేత ఫౌంటన్ పెన్ తీసుకొని తయారుగా ఉన్నారు. వెంటనే కూర్చున్న రైతులలో నేలటూరు రైతులు లేచి నిలబడి దివాన్‌జీ గారికి నమస్కరించి -

"అయ్యా! మా గ్రామ చెరువు మరమ్మతు చేసి ఇప్పటికి పదిహేను ఇరవై ఏళ్ళయినది చెరువువరకూ కాలవా, చెరువు తొట్టూ కూడా ఒండ్రు మట్టితో మేటవేసి పూడిపోయినవి. పైగా చెరువు తూర్పు అలుగూ, పడమటి అలుగూ, చెరువు కట్టాకూడా పదేళ్ళనాడు కొట్టిన గాలివానకు గండిపడి తెగిపోయినవి. అవి అగాయతు వర్షాలు కురిసి నీళ్ళు ఎంత వొమ్ముగా

వచ్చినా చెరువులో చుక్క నిలవడంలేదు, చెరువు మరమ్మతు చేయించ వలసినదని దివాణంవారికి పదేళ్ళుగా మేము ఎన్ని అర్జీలు పంపుకొన్నప్పటికీ వాటికింతవరకూ దాఖలా మకాబూకూడా కలగలేదు. నీటిసప్లయి సరిగా లేక ఈ పదేళ్లనుండి మేము ఆయకట్టులో వరిపైరు పెట్టుకోవడం ముగించుకొని రాగిపైరూ, సజ్జపైరూ పెట్టుకొన్నప్పటికీ, దివాణంవారు మా వద్ద గొర్రుకు ముప్పయి నలభై రూపాయల చొప్పున నగలికి మాగాణిశిస్తే వసూలు చేస్తుండారు కాబట్టి సికస్తు అయిన చెరువును వెంటనే దురస్తుగా రిపేరు చేస్తేనేగాని మేం బ్రతకలేం" అని దణ్ణాలు పెట్టుకొన్నారు.

దివాన్‌జీగారు- సరే! పేష్కారుగారూ! వ్రాసుకోండి అయిటం-1 నేలటూరు గ్రామ చెరువు మరమ్మతు. వెంటనే మీ గ్రామ చెరువు రిఫేరు చేయించే ఏర్పాటు చేయిస్తాం. తర్వాత?

రైతులు- మా గ్రామానికి నగరికి చెల్లించవలసిన భూమిశిస్తు ఎకరానికి రు. 13-8-0 చొప్పున రేటు వసూలు చేస్తుండారు. గింజలకు ధర లుండిన రోజుల్లో కూడా, సర్కారు గ్రామాల్లో ఇరుగారు పండించుకొనే భూములకు కూడా ఇంత తరంరేటు లేదు. దానిపై ధరలు పడిపోయి, చిన్న డబ్బు కంటికి అగుపడకుండా ఉండే రోజుల్లో ఇంతంత శిస్తులు కట్టేవరకు మాకు గ్రుడ్లు మీదికి వస్తుండై, మా కంటే సర్కారు గ్రామాల రైతులు మేలు!

దివాన్‌జీ- అదిగో! అక్కడే మీరు పొరబడుతున్నారు సర్కారు గ్రామాల పరిపాలన మేలుమేలని మీరు భ్రమపడుతున్నారు కాని, డబ్బు విషయం వచ్చినప్పుడు, నిజంగా జమీన్ గ్రామాల రైతుల కున్నంత సౌకర్యం వాళ్లకు లేనేలేదు. జమీందారు సర్వాధికారి. ఆయన కనికరిస్తే శిస్తు పూర్తిగా తోసివేసి రైతులకు ఉచితంగానే భూములివ్వవచ్చు. ఏదీ! ఇట్లాంటి అధికారం సర్కారులో ఎవరికుంది? కాబట్టి మీరా వెర్రి వెర్రి భ్రమలు మరిచిపోండి.

పేష్కారుగారూ, వ్రాసుకోండి. అయిటం-2 రైతులకు శిస్తు తగ్గించడం. తర్వాత?

రైతులు- మా పశువులు మేత మేసే కంచె భూములు కూడా రాజాగారు ప్రతీ ఏడూ ఏలంవేస్తూన్నారు. డబ్బాశ కొద్దీ కొందరు పెద్ద పెద్ద రైతులే కంచెలను ఏలంలో కొని, మా పశువులు మేత మేసినందుకు పసరం ఒక్కింటికి రెండేసీ మూడేసీ రూపాయల చొప్పున మా దగ్గర పుల్లరి వసూలు చేస్తున్నారు. పశువులు వూరువిడిస్తే రాజాగారి కంచెలో అడుగు పెట్టనిదే వాటికి కడుపులోకి గరికపోచ పోయే సాగీ లేకపోయె! మేమైనా పస్తుపండి కొని, ఎంతెంత పుల్లరి అయినా కట్టి నోరులేని జీవాలను బ్రతికించుకోవాలె గదా! తమరు ఈ విషయమై కనికరించాలె.

దివాన్‌జీ- మీరు చెప్పినదంతా సత్యం. రైతులకు తన ప్రాణం కంటె అధికమైనది పశువు. ఈ పుల్లరి పద్ధతి బొత్తిగా బాగులేదు. అవశ్యం రద్దు చేస్తాం. వ్రాయండి. అయిటం-3 పశువుల పుల్లరి. తర్వాత?

రైతులు- ఇదివరలో మా రాజాగారి గ్రామాలకు కూడా ప్రతీ ఏటా కాకపోయినా, ఏ రెండు మూడు ఫసలీలకో ఒకసారి జమాబందీ జరుగుతూ ఉండేది. మేం దాఖలు చేసుకొన్న భూమి దరఖాస్తులూ ఇస్తిఫాలూ, తీర్వజాస్తి అర్జీలూ ఫయిసల్ అవుతూ వుండేవి. అదేమిటోగాని, పెద్ద గాలివానకు ఇవతల నగరివారు జమాబందే జరుపలేదు. మేం ఎంత శిస్తు కట్టవలెనో లెఖ్ఖ తెలియక అల్లాడి ఆకులు మేస్తుండాం. పైగా ఈ కణ్ణమూ, రెడ్డీ మున్నూటు అరవై రోజులూ శిస్తు వసూలని మా రక్తం పీల్చి పిప్పి చేస్తుండారు.

దివాన్‌జీ- నిజం! ఇంతకాలంగా జమాబందీ జరగకపోవడం చాలా అప్రతిష్ఠ. ఇకమీద సక్రమంగా జరిపేటట్లు చేయిస్తాం. వ్రాసుకోండి. అయిటం-4 జమాబందీలు. తర్వాత?

రైతులు - మేము మాలవాళ్ళమండి. కుంఫిణీ గ్రామాల్లో దొరతనంవారు బీదలకు బీడుభూములు పట్టాకు ఇస్తుండారు సామీ! నగరిభూములు లుండై. గొప్ప గొప్ప రైతులే వాటిని కూడా శివాయిక్రింద ఆక్రమించుకొని సాగుచేసుకొంటూ ఉండారు. ఏ మూలనైనా బెత్తెడు నేలలో మేం నాగలి మోటిస్తే, ఆసాములందరూ బడితెలు చేత బట్టుకొని మాపైకి దూకుతారు. మా కులవృత్తులన్నీ కూలిపోయాయి,

కూలిగింజ అయినా సంపాదించుకోలేక మలమల మాడి చస్తుంటాం. మాకు తలా రెండేసి ఎకరాల బీడు భూములు దిట్టానికి మంజూరుచేస్తే ఏ జొన్న కర్రలో వేసుకొని నీ పేర దీపం పెట్టుకొంటాం - నా ఏలినవాడా!

దివాన్‌జీ - (మాల మాదిగల వద్దనుండి దరఖాస్తు అర్జీలు తీసుకొని) అట్లాగే. ఆలోచించి ఉత్తర్వులు పంపుతాం. మీరు మాత్రం త్రాగుడు వగైరా దుర్వ్యసనాలు మాని, డబ్బు పాడుచేసుకోకుండా, నగరివారిచ్చే భూములు కష్టపడి సేద్యం చేసుకొని వృద్ధిలోనికి రావాలె. తెలిసిందా!

మాలమాదిగలు - బుద్ధి! బుద్ధి! నా ఏలినవాడా!

దివాన్‌జీ - వ్రాయండి పేష్కారుగారూ! అయిటం-5 బీదలకు భూములు.

ఒక క్రయిస్తవుడు - నేను ఈ గ్రామాల వాడలో స్కూలు పెట్టి బడి చెప్పుతున్నాను సార్.

దివాన్‌జీ - ట్రయినింగు అయినావా?

క్రయిస్తవుడు - అయినాను సార్. హైయర్ గ్రేడు ప్యాసయినాను. క్రయిస్తవుణ్ణి, బడిపెట్టుకొనేటందుకు ఇల్లులేక చాలా ఇబ్బందిగా ఉన్నది. నగరివారి అసలు మినహాలో ఎక్కడయినా నాలుగు తాటిచెట్లూ, ఒక వేప చెట్టూ, తాటి ఆకూ మంజూరు చేయిస్తే ఒక చిన్న కొట్టం వేయించి బడి చెప్పుకొంటాను సార్!

దివాన్‌జీ - అర్జీ తెచ్చావా?

క్రైస్తవుడు - తెచ్చాను సార్. (అని యిచ్చును)

దివాన్‌జీ - (తీసుకొని) ఉత్తర్వులు పంపుతాం, ఇల్లు వేయించి, చక్కగా బడిచెప్పి, బీదలను వృద్ధిలోనికి తీసుకొనిరా. ఈ సారి మేము గ్రామం వచ్చినప్పుడు నీ స్కూలు తణిఖీ చేస్తాం. అయిటం-6 గ్రాంటు స్కూలుకు తాటిచెట్లూ, ఆకూనూ. వ్రాయండి. తర్వాత?.

రైతులు - ఇప్పటి కివి చాలండి. తమరు చిత్తగించి ఈ ఇబ్బందులు గనక తొలగిస్తే, ఇంకో తడవ మళ్ళీ మనవి చేసికొంటాం. ఇంకా చెప్పుకోవలసిన ఇతర గ్రామాల వాండ్లు తొందరపడుతున్నారు.

అని నేలటూరు రైతులు దణ్ణంపెట్టి పక్కకు తొలిగారు. పిదప ఇతర గ్రామాల రైతులు వరసగా ముందుకు వచ్చి, వారి వారికి గల ఇబ్బందులన్నీ ఈ ప్రకారమే చెప్పుకోగా, దివాన్‌జీ గారు వాటని కూడా పేష్కారుగారిచే పుస్తకంలో వ్రాయించారు, అప్పటికి తొమ్మిది గంటలయింది, నిలబడివున్న రైతుల నందరినీ కూర్చోవలసిందని దివాన్‌జీ గారు ఉత్తర్వులు చేయగా, అందరూ సర్దుకొని కూర్చున్నారు. పిమ్మట దివాన్‌జీ గారు లేచి -

"మీరు విన్నవించుకొన్న విషయాలన్నీ మేము వ్రాసుకొన్నాం. మీరు దాఖలు చేసుకొన్న అర్జీలు తీసుకొని పోతున్నాం. ఈ విషయములన్నీ నేను స్వయంగా రాజా బహద్దురువారితో చర్చించి త్వరలోనే మీరు కోరిన సౌకర్యాలన్నీ ఏర్పాటు చేస్తాం. నిజంగా మీమీ ఇబ్బందులను నేను స్వయంగా తెలుసుకొన్న తర్వాత నా మనస్సు చాలా పరితపిస్తున్నది. అవశ్యం మీకు తగిన ఏర్పాట్లు చేస్తాం.

"అయితే ఇప్పుడొక చిన్న విషయం మీకు నేను చెప్పవలసి యున్నది. సావధానంగా వినండి. ఇటీవల శ్రీ శ్రీ శ్రీ రాజావారికి ఇంటివస్థ ఒక గొప్ప ఆపద సంభవించినది. అది లగాయతు వారు మిక్కిలి చింతా క్రాంతులై ఉన్నారు. ఆ విషయమై వారు మీ కొక విజ్ఞప్తి పంపి, మీ వల్ల కొంత ద్రవ్య సహాయం కోరియున్నారు."

అని దివాన్‌జీగారు రైతులకు తలా ఒక విజ్ఞప్తి పత్రం పంచి పెట్టించారు. చదువు వచ్చిన రైతులు కొందరు చదువుకొంటున్నారు. చదువు రానివారు చేతిలో కాగితం పట్టుకొని చదువుకొన్నవారిని అడిగి తెలుసుకొంటున్నారు. ఇంతలో దివాన్‌జీగారు ఒక విజ్ఞప్తి పత్రాన్ని తీసుకొని ఈ విధంగా చదివి వినిపించారు.

"నా ఎస్టేటులో గల ప్రియజనులారా!

మే మిప్పుడు మీకొక చిన్న విన్నపము చేయబోతున్నాము. ప్రపంచమునగల సమస్తమైన చతుష్పాద జంతువులలోనూ శునకము - అనగా కుక్క మిక్కిలి విశ్వాసము గల జంతువు. విశ్వాసము గల జంతువేగాక, నిజముగా పరిశీలించినచో, శునకము మానవుని కంటె అనేక విధముల ఉత్కృష్టమైన జంతువు అని చెప్పదగి యున్నది. మాటాడ నేరదన్న లోప మొక్కటి తప్ప మిగిలిన విషయములలో శునకము మానవుని కెంత మాత్రమూ తీసిపోదు.

చిన్నతనమునుండీ మాకు భైరవమూర్తుల యెడల ప్రత్యేక ఆదరాభిమానములుండి, ఆజాతిని పోషించి కాపాడుటకు మేము పడుచున్న శ్రమ యంతయు మీకు తెలియనిది కాదు; కాని ఇటీవల మా దివాణములో మాకొక గొప్ప దుర్దశ ప్రాప్తించినది. మాకు పరమ విశ్వాసపాత్రమైన ఒక జాతి శునకముల దంపతులలో భర్త కుక్క అయిన జాకీ మాకు పరమ విశ్వాసపాత్రుడై, మా ప్రేమాతిశయముల కాటపట్టయి విరాజిల్లుతూ, ఇటీవల ఒక హీనజాతి మానవుని రక్త స్పర్శచే దానికి శరీరములో విషము ప్రవేశించి, జబ్బుచేసి అకస్మాత్తుగా ఆ గ్రామ సింహరాజము అకాల మృత్యువు వాతబడి, మములను దుఃఖ సాగరమున ముంచివేసినది

తచాది మేము సదరు జాకీ జ్ఞాపకార్థమై కొన్ని శాశ్వతమైన ధర్మ కార్యములు చేయ దలపెట్టితిమి ఇందుకు ద్రవ్యసంపత్తి అత్యవసరమై నందున మేము జాకీ స్మారకనిధి యనునొక ఫండును నిర్మించి, దానికి సంస్థానం తరపున పదివేల రూపాయల విరాళము ఇచ్చియున్నాము. కావున నాకు పుత్రసములైన రైతు సోదరులున్ను, తదితరులున్ను భూతదయార్ద్ర హృదయులలై వారి వారికి తోచిన రీతి జాకీ స్మారకనిధికి భూరి విరాళము లర్పించి, జాకీ పేరును చిరస్థాయిగా భూమిపై నిలుచునట్లు చేసి, దాని ఆత్మకు శాంతి కలుగచేయుదు రని కోరుచున్నాడను.

ఇట్లు,
మీ హితుడు
శ్రీశ్రీశ్రీ జమీందారు బహద్దురు

దివాన్‌జీగారు చదవడం పూర్తిచేసిన వెంటనే సభలో కరతాళధ్వనులు చెలరేగినవి. వారు చదివిన దంతయు వినీ కూడా, అర్థంగాని రైతులు కొందరు ఆ పాటునే వెర్రిచూపులు చూస్తూ కూర్చున్నారు. అర్థం అయిన రైతులు తలమీది పాగాలు పక్కకు తొలగించి తల గోక్కుంటున్నారు. కొంతసేపు సభలో నిశ్శబ్దం. వెనకగా, గడ్డాలకింద కర్రలు మోటించి నిలబడి ఉన్న మాలమాదిగలు చల్లగా వెనక్కు తగ్గుతున్నారు. వెంటనే దివాన్ పేష్కారుగారు లేచి ఎవ్వరినీ సభ విడిచిపోవద్దని హెచ్చరిక చేస్తూ, విజ్ఞప్తిలోని విషయములే మరల విపులంగా తెలియ జెప్పి, జాకీ స్మారక నిధికి సహాయపడవలసినదని ప్రబోధించారు.

పిమ్మట తాణాదారుగారు లేచి పెద్ద పెద్ద రైతులను ఉద్దేశించి, "లేచిరావోయ్, మల్లారెడ్డీ! పెద్దవాడవు. ముందు నీవు దారి తీస్తేనేగాని వీల్లేదు." అని ఒకరైతును పేరుపెట్టి ఆహ్వానించారు.

"ఆ! ఏం పెద్దో స్వామీ! అన్నిటికంటే తాటిచెట్టు పెద్ద. లోపల జవసత్వా లుండవద్దూ" అని ఆయన లేచి నిలబడి, జారిపోయిన మొలుగుడ్డ బిగించుకొన్నాడు.

"నువ్వే అట్లా అంటే ఎట్లా చెప్పూ! ఎప్పుడూ లేదులే దనుకోకు. సంపన్న గృహస్థుడివి. ధర్మకార్యాల పట్ల కొంత జాలిగుణం కనపరచాలి. అందులో రాజాగారి స్వవిషయం ఇది తెలుసునా" అని తాణాదారుగారు మళ్ళీ ప్రబోధించారు.

ముఖాన్న చిరునవ్వు నవ్వుతూ, మల్లారెడ్డి అడుగులో అడుగు వేసుకొంటూ దివాన్‌జీగారి బల్లదగ్గరకు పోయి, బైండు నోటుబుక్కులో రు. 30-00 లు అంకెవేసి సంతకం పెట్టాడు.

అట్లా వీల్లేదు నీ దర్జాకు తగినట్టుగా పోకుంటే నీకు లేకపోయినా, మాకందరికీ చిన్నతనంగా ఉన్నది. మొట్టమొదలు నీవే ఇట్లా చేస్తే ఎట్లా చెప్పూ" అని అంటూ తాణాదారుగారు బలవంతం చేసి, మల్లారెడ్డి చెయ్యి పట్టుకొని రు. 30-00 లను రు. 50-00 లుగా దిద్దించారు.

"అబ్బా! ఇట్లా నిక్కచ్చి చేస్తే ఎట్లా చెప్పండి పంతులూ" అని సణుగుకొంటూనే మల్లారెడ్డి అంతె సవరించి ఇవతలకు వచ్చాడు. పిదప సుబ్బారెడ్డీ, శేషురెడ్డీ, పోలారెడ్డీ, పట్టాభిరెడ్డీ, వెంకమ నాయుడూ, చినరామనాయుడూ వగైరా ఇట్లాగే పేరుల వరసన పేష్కారుగారు ఒక్కొక్కరినే పిలిచి, వాళ్ళచేత తలా ముప్పయి, పాతికా, ఇరవై, పదిహేనూ, పదీ చందాలు వేయించగా, వాళ్లున్నూ పుస్తకంలో సంతకం పెట్టారు. పన్నెండు గంటలకు అచ్చం నేలటూరు మీదనే జాకీ స్మారకనిధికి మూడు వందల ఏభయి రూపాయల చందాలు పడినై. ఈ ప్రకారం మిగిలిన గ్రామాల రైతులచేత కూడా చందాలు వేయించి ఆ పైకం మరునాడు ఉదయం ఎనిమిది గంటలకు దివాన్‌జీగారివద్ద జమకట్టి రశీదు తీసుకొని పోవలసినదని రైతుల కందరికీ గట్టిగా చెప్పిన పిదప సభ చాలించి అందరూ భోజనాలకు వెళ్ళిపోయారు.

6

దివాన్‌జీగారి సమక్షంలో మొఖమాటం వల్ల తప్పించుకోలేక చందాలు వేసినప్పటికీ, తర్వాత బయటికిపోయి, వారిలో కొంతమందికి ఈ స్మారకనిధి ఏమిటో, ఈ చందాలేమిటో, ఈ కుక్కలేమిటో అర్థంగాక తొకాడారు, దివాన్ పేష్కారు వగైరా ఉద్యోగులను మరల మరల ఈ విషయమై విచారిస్తూ సందేహాలు తీర్చుకొంటున్నారు. వసూలయిన పైకం యావత్తూ పేదల సహాయార్థమై రాజాగారు ఆస్పత్రులకూ, ధర్మసత్రాలకూ, మంచినీళ్ళ బావులు త్రవ్వించడానికీ వినియోగిస్తారని దివాణం సిబ్బంది రైతులకు నచ్చచెప్పి ధైర్యం చెప్పుతున్నారు. చందాలు పుస్తకంలో పడినది లగాయతు పైకం చేతికి వచ్చేవరకూ దివాన్‌జీగారు ఆ మకాంలోనే పీఠం వేసుకుని, తాబేదారీ సిబ్బందిని వసూలు డ్యూటీమీద పంపి నిలుచున్నట్టుగా డబ్బు వసూలు చేసి చేతిలో వేసుకొంటున్నారు. ఇచ్చుకోగల అసాములలో కొందరు ధర్మకార్యానికి సద్వినియోగం

అవుతుంది గదా పైకం, కొంత ఈ విధంగా ఖర్చు అయితే కూడబెట్టుకొన్న సంచితం కొంత విడుదలై పోతుందన్న పారమార్థిక దృష్టితో తృప్తిపడి చెల్లిస్తున్నారు. డబ్బుమీద కాసీనంగల కొందరు నలుగురూ ఇచ్చి తామివ్వకుంటే, ఈ ఎస్టేటువారు తెల్లవారి నిద్రలేస్తే నెత్తిమీది కేం తెచ్చిపెట్టుతారో అన్న భయం చేత, విధిలేక ముడుపులు మూట కట్టుతున్నారు. సమయానికి చేతికో పైకం సర్దుబాటులేని కొందరు సాహుకార్ల దగ్గరా, పెద్దరైతుల దగ్గరా చేబదులు తీసుకొని పైకం సంతన చేసుకొంటున్నారు. చేబదులు చిక్కని ఆసాములలో కొంత మంది ఠాణాదారు, సముద్దారు వగైరాలు తామే రహస్యంగా అవాల్తా పడి సమయానికి పైకం సర్దుబాటు చేసి వసూలయిన దని అనిపిస్తున్నారు. ఎట్లా అయితేనేం, మూడోరోజు సాయంత్రానికి ఆ మకాంలో చందాలుపడ్డ పన్నెండువందల రూపాయలూ దివాన్‌జీగారు నిముషాలమీద వసూలు చేసుకొని నాలుగోనాడు మరొక మజిలీకి చేరుకొన్నారు.

ఈ ప్రకారం రెండు మూడు ముసాఫర్లు జరిగే వరకు దివాన్‌జీగారు రైతుల బాధలను నివారించడానికీ, జాకీ స్మారక నిధికి చందాలు వేయించడానికీ బయల్దేరి వస్తున్నారని ఎస్టేటంతా తెలిసిపోయింది. ఒక గ్రామంలో చందాలువేసి మరొక గ్రామంలో వేయకుంటే బాగుండదనీ, దివాణంవారి సిబ్బంది ఎట్లాగా నెత్తిన రుద్దకుండా పోరనీ, తర్వాతి మకాంలో రాబొయ్యే గ్రామాల రైతులు ఈ సంగతి విని ఆయా గ్రామాధికార్ల ఒత్తిడి మీద ముందుగానే తయారుపడుతూ వున్నారు. రాజాగారి తర్వాత రాజాగారంత అధికారి దివాన్‌జీగారే స్వయంగా వస్తున్నారు గదా, వారి కింత సహాయం చేసినట్టూ ఉంటుంది. తమ కష్టసుఖాలు వారితో మనవి చేసుకున్నట్టూ ఉంటుందని, ముడుపులు మూటకట్టుతున్నారు. కట్టడి బాగా వున్న గ్రామాల్లో ఒక్కొక్క రైతే ప్రత్యేక ప్రత్యేకంగా చందాలు వేసే

పద్ధతి మాని కాలవగట్ల పచ్చిగడ్డి ఏలంపాటమీదా, దొరువుల్లోని చేపల ఏలం పాటమీదా, పోరంబోకు భూములలోని నగరి ఫల వృక్షాల అమరాయి ఫలితం ఏలం పాటమీదా, గ్రామఖర్చుకుగాను కూడాబెట్టిన పైకంలో- ఆ ఏడు జరగవలసిన ఖర్చులలో, డి.పి. డబ్ల్యు, ఓవర్ సీయరుకు, రెవిన్యూ ఇన్‌స్పెక్టరుకు, పోలీసు వారికి వగైరాలకు ఇవ్వవలసిన మామూళ్ళుపోను, మిగిలినవాటిలో ఏ అమ్మవారి జాతర ఖర్చులోనో, లేక వీధి భాగవతాలాడే దాసరి భాగవతులకూ, తోలుబొమ్మలాట వాళ్ళకూ, పగటి వేషగాండ్లకూ ఏటేటా ఇచ్చే మామూళ్లలోనో కొన్ని ఖర్చులు తగ్గించి, గ్రామ ఉమ్మడి సొమ్ములో రెండువందలో, మూడువందలో గ్రామంలోని నలుగురు పెద్ద తలకాయల సమ్మతిమీద మొత్తంగా యెత్తిపెట్టి, దివాన్‌జీగారు గ్రామానికి రానవసరం లేకుండా ముందుగానే వారి దర్శనానికి పోయి డబ్బు చెల్లించి మరీ వస్తున్నారు. ఉమ్మడిసొమ్ము పద్ధతిలేని మరికొన్ని గ్రామాలలో నీళ్ళ పూటల దామాషా ప్రకారం గ్రామంలో పదిపూటలుంటే, పూటకు ఏ ఇరవయ్యో, ఏ ముప్పయ్యో చొప్పున ఇన్నూరో, మున్నూరో పూటదార్లే జమ చేర్చి, దివాన్‌జీ గారు వచ్చి రావడంతోనే స్మారకనిధికి మొత్తం కట్టి వేసి, వారిని సాగనంపిన తర్వాత వారివారి పూటల్లో గల చిల్లర రైతుల దగ్గర ఎకరానికి పావలావంతునో, మూడణాలవంతునో పట్టీవేసుకుని తమకు రావలసిన పైకాన్ని నిదానం మీద దండుకొంటున్నారు. మరీ ఎత్తుబడిపోయి నుదారు స్థితిలో వున్న కొన్ని గ్రామాల రైతులు భయపడి, ఆ గ్రామ కర్ణాన్నీ, మునసబునీ ఆశ్రయించుకొని రాణావారుగారికీ, దివాన్ పేష్కారు గారికీ సిఫార్సులు చేయించుకొని, దివాన్‌జీగారి దృక్పథంలో వారి గ్రామం పడకుండా తప్పిపోయే ఏర్పాటులు చేసుకుంటున్నారు.

ఏ విధం చేతనయితేనేం, దివాన్‌జీగారు సంకల్ప సిద్ధులు. కార్యం తలపెట్టిన వేళావిశేషం గొప్పదయి నందున, స్మారకనిధికి విఘ్నేశ్వరపూజ

చేసి పట్టీ ఆరంభించింది లగాయతు ఏ అడ్డంకులూ లేకుండా తలచుకొన్న పని క్షణంలో పూర్తి అవుతూ, కార్యం జయప్రదంగా జరుగుతూ వచ్చింది.

ఈ ప్రకారం రెండూ రెండున్నర నెలలపాటు దీక్షతో దివాన్‌జీగారు ఎస్టేటు గ్రామాలన్నీ పర్యటనం చేసి, చందాలు వసూలయిన పిదప, హెడ్ క్వార్టర్సుకు తిరిగి వెళ్ళారు. చందాపైకం రాజాగారూ, దివాన్‌జీగారూ లెఖ్ఖ చూచుకోగా, ఇంకా వసూలు కావలసిన చిల్లర పద్దులు అక్కడక్కడ కొన్ని నిలిచిపోయినా, రాజాగారిచ్చిన పదివేలూగాక, చందాల పల్ల వసూలయి చేతికి వచ్చిన రొఖ్ఖం ప్రత్యేకం ఏభయివేల రూపాయలవరకూ జాకీ స్మారకనిధికి చేరింది. ఈ వసూళ్లలో కొంత పైకాన్ని రాజాగారికి తెలియకుండా దివాన్‌జీగారు కరణీకం చేశారని కొందరంటారు. ఎట్లయినప్పటికీ, దివాన్‌జీగారు మన రాజాగారికి కేవలం భగవత్స్వరూపులుగా గోచరిస్తున్నారు. వృద్ధాప్యంలో దివాన్‌జీగారింత శ్రమకోర్చి, జాకీ యెడల ఇంత త్యాగబుద్ధి చూపినందుకు రాజాగారు సంతోషించి, వారికి అంతటినుండి నెలకు వంద రూపాయల జీతం ప్రొమోషన్ చేశారు.

7

పిమ్మట జాకీ స్మారకనిధి ఏవిధంగా వినియోగం అయిందో ఎవరికీ తెలియదు కాని, దివాన్‌జీగారు సంస్థానం హెడ్‌క్వార్టర్సుకు చేరిన వారం రోజులకు ఒకనాడు నేలటూరు గ్రామాధికార్లకు పోస్టులో ఒక కవరుమాత్రం వచ్చింది. దానిని విప్పి గ్రామకర్ణం, మునసబులు చదువుకోగా, ఆ కాగితంలో ఈ ప్రకారం ఉన్నది.

"శ్రీ శ్రీ శ్రీ రాజాబహద్దరువారి
సంస్థానం నుండి
నేలటూరు గ్రామాధికార్లకు

మాదివాన్‌జీగారు మీ గ్రామం విజయం చేసినప్పుడు మీ గ్రామ రైతులు విన్నవించుకొన్న విన్నపములన్నీ మేము స్వయముగా చిత్తగించినాం. చెరువుల మరమ్మత్తులు రైతులు ఉమ్మడిగా ఏల చేసుకోకూడదో తెలియకుండా వుంది. ఈ ఆర్థికపు చిక్కుల రోజులలో రైతులు భూమిశిస్తు తగ్గించమని కోరడం, పుల్లరి కొట్టి వేయమని కోరడం ఉచితంగా కనిపించడం లేదు. అయినా, రైతులు కోరిన యావద్విషయాలనూ గట్టిగా ఆలోచించి త్వరలోనే ఉత్తర్వులను సాదరు చేయగలవారం. రైతు అభివృద్ధి, మా అభివృద్ధి. రైతు క్షేమమే మాక్షేమమూ అని విశ్వసిస్తున్నాం.

సంతకం

ఫర్ జమీందారు గారు"

కాని అప్పటికీ ఇప్పటికీ జమీందారుగారివద్ద నుంచి ఉత్తర్వులు సాదరు కానేలేదు. జాకీ లోహ ప్రతిమ ప్రతిష్ఠ యింకా జరగనూలేదు. అది తయారయిందన్న వారేకాని దాని నింతవరకూ చూచినవారూ లేరు.